క్లుప్తంగా

నేడు టెంకాయల విక్రయానికి వేలం పాట

కొలిమిగుండ్ల: కార్తీక మాసం సందర్భంగా బందార్లపల్లె సమీపలోని పురాతన నేల బెలుం మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద టెంకాయల విక్రయించేందుకు ఆదివారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. వేలం పాట దక్కించున్న వ్యక్తి కార్తీక మాసం పూర్తయ్యే వరకు టెంకాయల విక్రయం చేసుకోవచ్చని చెప్పారు. ఆసక్తిగలవారు ఉదయం 10 గంటలకు ఆలయ ఆవరణలో జరిగే వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

ఐక్యంగా ఉద్యమించాలి

బేతంచెర్ల: న్యాయమైన హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఎంఈఎఫ్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు మజీల్, శేషు మాదిగి, ఎంఎస్ఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షులు అనిల్ మాదిగ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో జరిగే విశ్వరూప మహాసభకు శనివారం మండల కేంద్రంతోపాటు గ్రామాల నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



నగదు అందజేస్తున్న మండల తిరుమలేశ్వర్ రెడ్డి

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్ కాలనీల్లో జంగాల పేట కాలనీకి చెందిన మారెన్న (40)గుండె సంబంధిత వ్యాధితో మృతి చెందాడు. ఈ మేరకు శనివారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ. 10 వేలను మృతుడి భార్య సుంకమ్మకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్ రెడ్డి, నాయకులు నిరంజన్, ఆనంద్, చంద్రుడు, సుధాకర్, రవి అందజేశారు.

మహాసభల పోస్టర్లు విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకురాళ్లు

బనగానపల్లె రూరల్ : జిల్లా కేంద్రం నంద్యాలలో ఈ నెల 17,18,19వ తేదీల్లో నిర్వహించే ఏపీ మహిళా సమాఖ్య మహాసభల పోస్టర్లను శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సమాఖ్య నాయకురాళ్లు విడుదల చేశారు. హక్కుల సాధనకు మహిళలు ఐకమత్యంగా ఉద్యమించాలని ఈ సందర్భంగా ఏపీ మహిళా సమైఖ్య రాష్ట్ర కార్యదర్శి దుర్గభవాని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మహిళా నాయకురాలు రామసుబ్బమ్మ, రామేశ్వరి,సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు రామాంజనేయులు,నాయకులు శివయ్య, సంజీవులు, కుళ్లాయి,సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

ప్యాపిలి: మండల పరిధిలోని జక్కసానికుంట్ల గ్రామానికి చెందిన మేడగాని నాగమ్మ అనారోగ్యం బారిన పడి కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందింది. బాధితురాలి ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీదేవమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్ రెడ్డి విషయాన్ని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి చొరువతో బాధితురాలికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ. 38 వేలు మంజూరు అయ్యింది. ఈ మేరకు శనివారం ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకులు బాధితురాలికి రూ. 38 వేల చెక్కును అందజేశారు. అలాగే పోతుదొడ్డి గ్రామానికి చెందిన అనురాధకు రూ. 40 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు కృష్ణమూర్తి అందజేశారు.

బైకు చోరీ

డోన్ టౌన్ : పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యంశెట్టి బైకును గుర్తు తెలియని దుండగులు శనివారం మిట్ట మధ్యాహ్నం చోరీ చేశారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు తన ఏపీ 21జె,9297 హీరో హోండా స్ప్లెండర్ బైకును శనివారం కొత్త బస్టాండ్ సమీపంలోని కృష్ణా లాడ్జి ఎదురుగా ఉన్న టీ స్టాల్ ఉంచాడు. రెండు గంటల తర్వాత వచ్చి చూడగా బైకు కన్పించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామని పట్టణ పోలీసులు తెలిపారు.

108 వాహనంలో ప్రసవం



సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామానికి చెందిన నాగరాజు భారతి దంపతుల కుమార్తె గురుదేవి 9 నెలల గర్భిణి. నెలలు నిండడంతో శనివారం 108 అంబులెన్స్‌లో కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో నొప్పులు అధికమయ్యాయి. ఈఎంటి నాగరాజు నార్మల్ డెలివరీ చేశారు. గురుదేవి పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అంబులెన్స్ సిబ్బంది నాగరాజుకు,పైలెట్ జయన్నకు బాలింతతోపాటు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కార్తీకం...శివోహం!

- 14 నుంచి కార్తీక మాసం ప్రారంభం
- ముస్తాబైన శైవక్షేత్రాలు
- 26న యాగంటి క్షేత్రంలో ఆకాశ మహాదీపోత్సవం



యాగంటి క్షేత్రం ఏరియల్ వ్యూ



బనగానపల్లె : శివునికి ప్రీతికరం కార్తీక మాసం. నెల రోజుల పాటు భోళా శంకరుని నిత్య పూజలతో కొలుస్తారు భక్తులు. స్నాన, దాన, జపాలు, పూజలు, ఉపవాస వ్రతాలు, దీపాలు వెలిగించడం, వనభోజనాలు తదిర పుణ్య కార్యాలు చేయడం మూలంగా జన్మజన్మల పాపాలను ప్రక్షాళన చేసి పుణ్యఫలాలను ప్రసాదించే మహిమాన్వితమైంది కార్తీక మాసం అని భక్తుల నమ్మకం. కార్తీక మాసానికి సమానమైన మాసం మరొకటి లేదని స్కంధ పురాణంలో పేర్కొనబడింది కూడా. ఈనెల 14 నుంచి కార్తీక మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో శైవ క్షేత్రాలు ముస్తాబవుతున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే పవిత్ర శైవక్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన బనగానపల్లె పశ్చిమాన కొండల మధ్య వెలసిన యాగంటి క్షేత్రం కార్తీక పూజలకు ముస్తాబైంది. యాగంటి క్షేత్రంలో స్వయాన ఉమామహేశ్వరుల స్వామివార్లను అగస్త్య మహర్షి అర్చించినారని ప్రతీతి.

ఏకశిలా రూపంలో వెలసిన ఉమామహేశ్వరులు

ఏకశిలా రూపంలో ఉమామహేశ్వరులు కొలువై ఉండడం ఈ క్షేత్రం ప్రత్యేకత. విజయనగర సామ్రాజ్య ప్రభువులు, హరిహర బుక్కరాయులు యాగంటి క్షేత్రాన్ని నిర్మించినట్లు శాసనాలు చెబుతున్నాయి. ఈ దేవస్థానంలో శ్రీవిరాట్ పోతులూరు వీర బ్రహ్మేంద్రస్వామి సంచరించారని కథనం. శ్రీవారిని సేవించి గరిమిరెడ్డి అచ్చమ్మకు జ్ఞాన బోధ చేసినట్లు ప్రతీతి. దేశంలో ఎక్కడా లేనివిధంగా యాగంటిలో ఉమామహేశ్వరస్వామి నంది వాహన శిలావెలసితమై ఆదిదంపతులు వెలసిన ఏకైక పుణ్యం క్షేత్రం. ఆనాడు ఎందరో మహానుభావులు స్వామివారిని దర్శించి సేవించి తరించారు. ప్రకృతి వరప్రసాదాలుగా పెద్దకొనేరు, చిన్నకొనేరు, రోజు రోజుకు పెరుగుతున్న బసవయ్య మనకు ప్రత్యేక్షంగా కనబడుతారు. నేకంటి– నేగంటి అను నానుడి నేడు యాగంటి క్షేత్రంగా పిలువబడుతుంది.

నాలుగు సోమవారాలు ప్రత్యేక పూజలు

యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 14 నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు కార్తీక మాసోత్సవాల కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తొటబుచ్చిరెడ్డి శనివారం తెలిపారు. 14వ తేదీన కార్తీక మాసోత్సవాలు ప్రారంభంకాగా సోమవారాలైన ఈ నెల 20, 27, డిసెంబర్ 4, 11వ తేదీల్లో ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. చివరి సోమవారం దేవస్థానంవారి ఉచిత ప్రసాద వితరణ, స్వామివారి పల్లకీ సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. అదేవిధంగా ఈ నెల 26వ తేదీ పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని ఉమామహేశ్వ రమ్మ దంపతులతో పాటు శ్రీ ఉమామహేశ్వర నిత్యాన్నదాన సంస్థ భక్తుల సహకారంతో సాయంత్రం ఆకాశ మహాదీపోత్సవం ఉంటుందని వివరించారు.



నేల బెలుం మల్లేశ్వరస్వామి ఆలయం

కొలిమిగుండ్ల: కార్తీక మాసం పూజలకు శైవ క్షేత్రాలు ముస్తాబవుతున్నాయి. మండలంలోని బందార్లపల్లె సమీపాన వెలసిన పురాతన నేల బెలుం మల్లేశ్వర స్వామి ఆలయం, పెట్నికోట గుండు మల్లేశ్వరస్వామి, కాచూటీ విశ్వేస్వరస్వామి ఆలయంతో పాటు అంకిరెడ్డి పల్లె, కనకాద్రిపల్లె, గొర్విమానుపల్లె, తుమ్మలపెంట, చింతలాయిపల్లె తదితర గ్రామాల్లోని శివాలయాల్లో కార్తీక మాస పూజలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. నాలుగు కార్తీక సోమవారాలు రావడంతో మహిళలు ఆయా ఆలయాల్లో పెద్ద ఎత్తున కార్తీక దీపాలు వెలిగించనున్నారు. కొలిమిగుండ్లలోని లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని జ్వాలాతోరణం వెలిగించనున్నారు. నేలబెలుంలో మూడవ సోమవారం సందర్భంగా పెద్ద ఎత్తున తిరునాల మహోత్సవం జరగనుంది.

ముచ్చట్ల మల్లికార్జునస్వామి ఆలయం ముస్తాబు



ముచ్చట్ల మల్లికార్జునస్వామి

బేతంచెర్ల: దేవతలే ముచ్చటపడి భూలోకంలో ఒక శైవ క్షేత్రాన్ని నెలకొల్పిన పవిత్ర స్థలం గా ప్రసిద్ధి కెక్కింది ముచ్చట్ల భ్రమరాంభ, మల్లికార్జున స్వామి ఆలయం. ఈ నెల 14 నుంచి ప్రారంభమయ్యే కార్తీక మాస ఉత్సవాలను ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయం ముస్తాబవుతోంది. బేతంచెర్ల మండలానికి 5 కిలో మీటర్ల దూరంలో హెచ్‌కొట్టాల గ్రామ సమీపాన ఈ ఆలయం ఉంది. హెచ్ కొట్టాల గ్రామం వరకు డోన్ రహదారిలో బస్సులు బేతంచెర్ల, డోన్‌కు వెళ్తుంటాయి. అక్కడ నుండి రెండు కిలోమీటర్ల మేర నడిచి వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించుకోవచ్చు. కార్తీక మాసం ముగిసేంతవరకు ప్రతి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

మంత్రి బుగ్గన చొరవతో ఆలయానికి మహర్దశ

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో ముచ్చట్ల మల్లికార్జునస్వామి ఆలయానికి మహర్దశ వచ్చింది. 2022లో మంత్రి బుగ్గన రూ.3 కోట్లతో ఆలయానికి బీటీ రోడ్డు వేయడంతో భక్తులకు రహదారి కష్టాలు తప్పడమే కాకుండా సౌకర్యంగా మారింది. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో నూతనంగా రూ.1.90 కోట్లు మంజూరైనట్లు ఈఓ మద్దిలేటి తెలిపారు. ఈ నిధులతో గాలిగోపురం పునరుద్ధరణ పనులు, ఆలయంలో గ్రానైట్ రఫ్ ఫ్లోరింగ్, కోనేరు, రథ శాల నిర్మాణంతో పాటు రథోత్సవం తేరును తయారు చేయించడం జరుగుతుందన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

బనగానపల్లె రూరల్ : యాగంటి క్షేత్రంలో ఈ నెల 14వ తేది నుంచి డిసెంబరు 12వ తేది వరకు జరుగు కార్తీక మాసోత్సవాల సందర్భంగా భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సూచించారు. శనివారం సాయంత్రం మండలంలోని యాగంటి క్షేత్రంలో కార్తీక మాస ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. భక్తులకు తాగునీటి సౌకర్యం, వైద్య శిబిరాలతో పాటు 24 గంటలు విద్యుత్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ముందుగా ఎమ్మెల్యే ఆలయంలో శివపార్వతులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ తిమ్మారెడ్డి, ఎస్ఐ రామిరెడ్డి, అర్చకులు మహేష్ శర్మ, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు గాధంశెట్టివేనుగోపాల్, పుల్లారెడ్డి, తిరుపాల్, మల్లేష్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్తీకమాస ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

డోన్ : పట్టణంలోని శివారు ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. 32వ వార్డులో శనివారం ప్రభుత్వం స్పెషల్ గ్రాంట్ ద్వారా మంజూరు చేసిన రూ.35లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో 32 వార్డులకు మొత్తం రూ.6.40కోట్లు మంజూరయ్యాయన్నారు. త్వరలోనే పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు జీడీపీ ద్వారానే కాకుండా గోరుకల్లు రిజర్వాయర్ నుంచి ఇంటింటికీ తాగునీటి పథకం (వాటర్ గ్రిడ్) అమలు చేయనున్నామన్నారు.



సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న రాజేష్

కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు కోత్రికె హరికిషన్, జాకీర్ హుసేన్, కౌన్సిలర్ ధారా హరినాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు డీలర్ క్రిష్ణ, సతీష్, గోవిందరాజులు పాల్గొన్నారు.

హిందువులు ఐకమత్యంగా మెలగాలి

బనగానపల్లె రూరల్ : హిందువులు ఐకమత్యంగా మెలగాలని సమరసత సేవా పౌండేషన్ రాయలసీమ జోన్ ప్రచారక్ చౌదూరి ఈశ్వర్‌రెడ్డి సూచించారు. శనివారం స్థానిక తెలుగుపేటలోని బీవీ సుబ్బారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో సమరసత సేవా పౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ ధర్మ సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలని, హిందూ సంప్రదాయాలను పిల్లలకు నేర్పించాలని సూచించారు. టీటీడీ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో రూ.10 లక్షలతో దేవాలయాను నిర్మించడం జరుగుతుందన్నారు. స్వామిజీలు ఆధ్యాత్మిక బోధనలు చేశారు. ముందుగా స్థానిక ఆంజనేయస్వామి దేవాలయం నుంచి కూరగాయాల మార్కెట్, పొట్టి శ్రీరాములు విగ్రహం, తెలుగుపేట మీదుగా ఫంక్షన్‌హాల్ వరకు శోభయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీజయదేవానంద గిరిస్వామి, జ్ఞానేశ్వరనందస్వామి, ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ సురేంద్ర, నంద్యాల జిల్లా కన్వీనర్ మాధవరెడ్డి, జిల్లా సహకన్వీనర్ నాగమోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ నాగమల్లారెడ్డి, బీజేపీ నాయకులు బీవీ సుబ్బారెడ్డి, సబ్ డివిజన్ కన్వీనర్ శివరామిరెడ్డి, న్యాయవాదులు జగన్నాథ్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, ఓబులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాయలసీమ జోన్ ప్రచారక్ చౌదూరి ఈశ్వర్‌రెడ్డి

అంతర్జాతీయ క్రీడాకారుడికి సన్మానం

ప్యాపిలి: పట్టణానికి చెందిన అంతర్జాతీయ క్రీడాకారుడు కొంగనపల్లి వెంకటనారాయణను స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఘనంగా సన్మానించారు. సర్పంచ్ లక్ష్మీదేవి, ఉప సర్పంచ్ గద్దం భువనేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, ఏపీఐసీసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి తదితరులు వెంకటనారాయణ సేవలను కొనియాడారు. చైనాలో జరిగిన పారా రోయింగ్‌లో భారత్ తరపున పాల్గొన్న వెంకటనారాయణ ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించడం గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రాజా నారాయణమూర్తి, బోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సోమశేఖర్, కోటయ్య, పూజారి శ్రీనివాసులు, నిజాం, గాజుల నరసింహులు, పాండు తదితరులు పాల్గొన్నారు.



వెంకటనారాయణను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి

సంజామల: మండల పరిధిలోని ఆర్.లింగందిన్నె గ్రామంలో రూ. 30 లక్షలతో వివిధ కాలనీలలో చేట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్యయ్యాయి. ప్రస్తుతం వాటర్ క్యూరింగ్ పనులు జరుగుతున్నాయి. గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆర్.లింగందిన్నె గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని స్థానికులు సీసీ రోడ్డు నిర్మించాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఎన్ఆర్‌జీస్ నిధులు రూ.10 లక్షలు, గడపగడప మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలు మంజూరు చేయించారు. ఈ మేరకు దస్తగిరి స్వామి కాలనీ, ఆంజనేయస్వామి, మైన్ బజార్‌లలో చేపట్టిన రోడ్డు పనులు పూర్తయ్యాయి. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



ఆర్.లింగందిన్నె గ్రామంలో క్యూరింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు

మల్లన్నను దర్శించుకున్న కర్ణాటక డిప్యూటీ సీఎం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను కర్ణాటక డిప్యూటీ చీఫ్‌మినిస్టర్ డీకే శివకుమార్ శనివారం దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ధర్మకర్తల మండలి చైర్మన్‌రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకుని స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా ధర్మకర్తల మండలి చైర్మన్, ఈఓలు స్వామి అమ్మవార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.



కర్ణాటక డిప్యూటీ సీఎంకు స్వామివార్ల జ్ఞాపిక అందజేస్తున్న చైర్మన్, ఈఓ

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

- డీఎస్పీ శ్రీనివాస రెడ్డి

డోన్ టౌన్ : బాణా సంచా విక్రయదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచించారు. అన్నారు. పట్టణ సమీపంలోని గోసానిపల్లె గ్రామ దగ్గర ఏర్పాటు చేసిన బాణా సంచా నిల్వ గోడౌన్‌ను శనివారం సీఐ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి డీఎస్పీ పరిశీలించారు. అదేవిధంగా వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన బాణా సంచా విక్రమాల స్టాళ్లను పరిశీలించి వ్యాపారులతో మాట్లాడారు. బాణాసంచా విక్రయాలు చేసేప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ సందర్భంగా డీఎస్పీ సూచించారు. అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి దుకాణం వద్ద నీరు, ఇసుక బకెట్‌లు, డ్రమ్ములు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దుకాణం సమీపంలో అగ్నికి సంబంధించిన వస్తువులు, బీడి, సిగరెట్‌లు ఉపయోగించరాదని చెప్పారు. ఏ మాత్రం పొరపాట్లు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, లైసెన్స్ దారులే బాణాసంచా విక్రయాలు జరపాలన్నారు.



మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తున్న డీఎస్పీ

ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఉమా మహేశ్వర్‌రెడ్డి

బేతంచెర్ల: పొదుపు మహిళలకు బ్యాంకుల ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కేడీసీసీ బ్యాంక్ జనరల్ మేనేజర్ ఉమా మహేశ్వర్‌రెడ్డి, విజయవాడ అప్కాబ్ జనరల్ మేనేజర్ విజయ్ భరద్వాజ్ తెలిపారు. శనివారం పట్టణంలోని వైకేపీ కార్యాలయంలో డీఆర్‌డీఏ వైకేపీ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ అడ్డాకుల శ్రీనివాసులు, కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలోని డ్వాక్రా మహిళా సంఘాలు కేడీసీసీబీ బ్యాంకులో ఉన్న ఎస్‌హెచ్‌జీఎస్ స్వయం సహాయక సంఘాల సభ్యులకు కేడీసీసీ బ్యాంకులో రూ. 10 నుంచి 20 లక్షల వరకు గ్రూపుల సీనియార్టీ మేరకు రుణాలు ఇస్తామని తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కోవెలకుంట్ల: జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణ శివారులోని వీరభద్ర ఫంక్షన్ హాలులో శనివారం నియోజకవర్గంలోని ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కోవెలకుంట్ల, బనగానపల్లె, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల మండలాల్లోని ప్రైవేట్ పాఠశాలల్లో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేసి నాడు– నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు అన్ని వసతులు సమకూర్చిందన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

సున్నపురాయి తరలిస్తున్న లారీ సీజ్

కర్నూలు (న్యూటౌన్): డోన్ మండలం యు.కొత్తపల్లె వద్ద అక్రమంగా సున్నపురాయి తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శనివారం తెల్లవారుజామున విశ్వసనీయ సమాచారం మేరకు ఆకస్మికంగా దాడి చేసి లారీని పట్టుకున్నామన్నారు. మైనింగ్ డీడీ మాట్లాడుతూ డోన్‌కు చెందిన గౌసియా ట్రాన్స్‌పోర్టుకు చెందిన లారీ అక్రమంగా సున్నపురాయి తరలిస్తున్నట్లు విచారణలో తేలడంతో తదుపరి చర్యల నిమిత్తం జలదుర్గం పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు. అక్రమంగా ఎవరైనా డోలమైట్, సున్నపురాయి, వైట్‌షీల్, స్టెయిడెడ్ పౌడర్ తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చలో విజయవాడ పోస్టర్లు విడుదల

డోన్ టౌన్ : కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఎం ఈ నెల 15న విజయవాడలో చేపట్టనున్న ప్రజా రక్షణ భేరీని విజయవంతం చేయాలని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, సీఐటీయూ కార్యదర్శి శివరాం పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం 15న చలో విజయవాడ పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అడ్డంగా విడగొట్టి పదేళ్లవుతున్నా నేటికీ విభజన హామీలు అములుకు నోచుకోలేదని ఆందోళన

మహిళకు తీవ్ర గాయాలు

అవుకు: మండల పరిధిలోని అవుకు రిజర్వాయర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కడప జిల్లా జమ్ములమడుగు మండలం నవాబ్‌పేటకు చెందిన గురుదేవి కంబగిరిస్వామిలో జరిగే బంధువులు శుభకార్యక్రమానికి శుక్రవారం అర్ధరాత్రి ఐసర్ వాహనంలో వెళ్తుంది. అవుకు చెరువు కట్ట సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఐసర్ వాహనాన్ని తాకుతూ వెళ్లడంతో గురుదేవి కుడి చేతికి తీవ్ర రక్త గాయాలు అయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్ ఈఎంటీ పుల్లయ్య, పైలట్ వెంకటేశ్వర్లు క్షతగాత్రురాలిని బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం కర్నూలు ఆసుపత్రికి తరలించారని అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.

సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలి

బనగానపల్లె రూరల్ : స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య డిమాండ్ చేశారు. స్థానిక ఏటీయుసీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపరింటెండెంట్ విధులను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వాసుపత్రిలో సరైన వసతులు లేవంటూ గర్భిణులను తన వైద్యశాలలో చేర్పించుకుంటూ పేదలను దోచుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు శివయ్య, బాలకృష్ణ, స్వామి, సుబ్బయ్య, రామ్మోహన్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

గోరుకల్లులో 8 టీఎంసీల నిల్వ

పాణ్యం: గోరుకల్లు జలాశయంలో 8.8 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ సుభకుమార్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోయిందన్నారు. ప్రస్తుతం ఎస్సార్బీసీకి 1500 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. అలాగే ఎస్సార్బీసీకి ఈనెల 14వ తేదీ వరకు నీటిని అందిస్తామని చెప్పారు. వారబందీలో పద్ధతిలో మరో వారం లేదా పది రోజుల్లో నీటిని వదులుతామన్నారు. ఎక్కడా నీరు వృథా కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.